మినుము పంటపై తుఫాన్ తీవ్ర ప్రభావం

- తెగుళ్లతో దెబ్బతింటున్న పంట
- పంటలో తగ్గనున్న దిగుబడులు
- ఆందోళనలో మినుము రైతులు

వేముల : మినుము పంటపై మిచాంగ్ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. నాలుగు రోజులుగా వర్షాలు పడటంతో పంటకు తెగుళ్ల సోకాయి. దీంతో పంట నిలువునా నల్లగా మారి ఎండిపోతోంది. పులివెందుల నియోజకవర్గంలో సుమారు 8 వేల ఎకరాలలో మినుము పంట సాగైంది. సెప్టెంబర్ చివరి వారంలో పదును వర్షాలు కురిశాయి. అదునులో భూములు పదున్లు కావడంతో మినుము పంటను సాగు చేసుకున్నారు. ఖరీఫ్‌లో వర్షాభావం నెలకొని పంటలు సాగు కాలేదు. పొలాలన్నీ బీళ్లుగా ఉండిపోయాయి. ఖరీఫ్ సీజన్ ముగిసే సమయంలో పదును వర్షాలు రావడంతో రైతులు ఎంతో ఆశతో మినుము పంటను సాగు చేశారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాధార పంట గానూ, వ్యవసాయ బోర్ల కింద మినుమును రైతులు సాగు చేశారు. పంట సాగు చేశాక వర్షాభావం నెలకొన్నప్పటికి భూమిలో తేమతో పంట ఏపుగా పెరిగింది. పంటపై ఆశతో రైతులు పంటను కాపాడుకున్నారు. పంట సాగులో ఎకరాకు ఐదారువేల చొప్పున పెట్టుబడులు పెట్టి సాగు చేశారు.

పంటలో తగ్గనున్న దిగుబడులు :

తుఫాన్‌తో పంటలో దిగుబడులు కూడా తగ్గుతాయని రైతులు అంటున్నారు. మరో 15 నుంచి 20 రోజులలో పంట కోత కోయాల్సి ఉంది. ఈ దశలో తుఫాన్‌తో పంటలో దిగుబడులు పూర్తిగా తగ్గుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడులు ఉంటాయని ఆశించామని.. తుఫాన్‌తో వర్షాలు పడటంతో 3 నుంచి 4 క్వింటాళ్ల కూడా దిగుబడులు అందే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో మినుము రైతులు :

తుఫాన్‌తో పంట దెబ్బతినడంతో మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని వాపోతున్నారు.

తెగుళ్లతో పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు పంటను దున్ని వేయాల్సి ఉందని రైతులు అంటున్నారు. పంట సాగు చేశాక ఏపుగా పెరగడంతో దిగుబడులు ఉంటాయని ఆశించామని.. కోత కోయాల్సిన దశలో తుఫాన్ పంట దెబ్బతింటుందని ఊహించలేదని రైతులు అంటున్నారు. మినుము పంట దెబ్బతినడంతో పూర్తిగా నష్టపోతున్నామని వారు వాపోతున్నారు.



గొందిపల్లెలో తుఫాన్‌తో తెగులు సోకి దెబ్బతిన్న మినుము పంట

నాలుగు ఎకరాల్లో సాగు చేశా :



నాకున్న నాలుగు ఎకరాలలో మినుము పంట సాగు చేశా. ఎకరాకు సాగుకు, మందులకు రూ.20 వేలకు పైనే ఖర్చు చేశా. పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడులు వచ్చాయని ఆశించా. అయితే తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడి పంట దెబ్బతింది. నల్ల తెగులు సోకి సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. సాగులో తీవ్రంగా నష్టపోతున్నా.

– చంద్రమోహన్‌రెడ్డి, రైతు, గొందిపల్లె

సాగులో దిగుబడులు ఆశించిన మేర లేవు :



మినుము సాగులో దిగుబడులు ఆశించిన స్థాయిలో అందే పరిస్థితిలో లేవు. సకాలంలో పదును వర్షం పడటంతో మూడు ఎకరాలలో మినుము పంట సాగు చేశా. పంటకు తెగుళ్ల సోకకుండా ముందుజాగ్రత్తగా మందులను పిచికారి చేశా. పంట బాగుంది.. దిగుబడులు ఆశించిన మేర అందుతాయనుకున్న దశలో తుఫాన్ దెబ్బతీసింది.

– చంద్ర ఓబుళరెడ్డి, రైతు, గొందిపల్లె

వైఎస్సార్ బీమా అందజేత

పులివెందుల రూరల్ : పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో చిరువ్యాపారి షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తమను ఆదుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కోరారు. వైఎస్సార్ బీమా ద్వారా రూ.5 లక్షలు, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి మరొక రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియోను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇప్పించారు. వాటికి సంబంధించి చెక్కును మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించండి

లింగాల : అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా కారణంగా అంగన్‌వాడీ పాఠశాలలు మూతబడి ఉంటే వాటిని తెరిచి అంగన్‌వాడీ పాఠశాలల్లోని పాలు, గుడ్లు పిల్లలకు, గర్భిణులకు అందించాలని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులకు ఎంపీడీఓ సురేంద్రనాథ్ ఆదేశాలను జారీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది తాళాలు ఇవ్వడానికి సహకరించని యెడల సంబంధిత వీఆర్‌ఓ పంచనామా వేసి తాళాలు పగులగొట్టి పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.

క్లుప్తంగా

ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం వాయిదా

సింహాద్రిపురం : ఈనెల 15వ తేదీనుంచి ప్రారంభం కావాల్సిన ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం, ఇతర గణన కార్యక్రమాల కారణంగా ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం వాయిదా పడిందని.. ఈనెల 26వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. క్రీడాకారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం పంపిణీ



పెద్దచెప్పలి బీసీ కాలనీ అంగన్‌వాడీ తాళాలను పగులగొడుతున్న సచివాలయ సిబ్బంది

కమలాపురం : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దచెప్పలి బీసీ కాలనీలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్‌లు కలసి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి పంచనామా నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులను పిలిచి డ్వాక్రా మహిళల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ జ్యోతి, ఈఓపీఆర్‌డీ శారదారెడ్డిలు పెద్దచెప్పలితో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా చూడండి

లింగాల : ప్రస్తుతం ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని వాటిలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు సమావేశం నిర్వహించారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన బీఎల్‌ఓల సమీక్షలో ఫారం-7, ఫారం-8లలో ఓటర్లు ఎన్ని అందించారన్న దానిపై ఆరా తీశారు. స్థానిక నివాసంలేని వారి ఓట్ల తొలగింపులోనూ, మృతి చెందిన వారి ఓట్ల తొలగింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ త్రిభువన్‌రెడ్డి, ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



షాహిద్

ఎర్రగుంట్ల : పట్టణంలో నివాసం ఉండే ఆర్‌ఎస్ షాహిద్‌కు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్సార్సీపీ కార్యలయం నుంచి నియామకం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. పార్టీ గెలుపునకు తన వంత కృషి చేస్తూ విద్యార్థులందరికి సంక్షేమ పథకం అందేలా చూస్తామన్నారు

ప్రతి పంటకు ఈ-క్రాప్ చేయించుకోండి

వేముల : రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ నరసింహారెడ్డి రైతులకు సూచించారు. గురువారం వేములలో పంట ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర, పంట కొనుగోళ్లు, సున్నా వడ్డీ పంట రుణాలు వర్తిస్తాయన్నారు. అంతేకాక ఆర్‌బీకేలలో యూరియ, డీఏపీ, వైట్ పొటాష్ వంటి ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. పంటలకు అవసరమైన రైతులు ఆర్‌బీకేలలో రసాయనిక ఎరువులను తెచ్చుకోవచ్చునన్నారు. అలాగే గ్రామాల్లో త్వరితగతిన పంట ఈ-క్రాప్ నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఓ చెన్నారెడ్డి, వీహెచ్‌ఓ హారిక, రైతులు పాల్గొన్నారు.

సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ట

పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం సరస్వతిదేవి నూతప విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా విగ్రహానికి గణపతిపూజ, ఆకుపూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, విగ్రహ దాత చిన్నయ్యలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలి

వేంపల్లె : ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథం అలవరుచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా సమన్వయకర్త శ్రీరాములు, జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైంటిఫిక్ టెంపర్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మూఢ నమ్మకాలపై విద్యార్థులు తిరుగుబాటు చేయాలన్నారు. అంతేకాక సైన్స్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక చెన్నారెడ్డి కాలనీ సచివాలయ పరిధిలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నేతృత్వంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పార్నపల్లె కిశోర్‌లతో కలిసి ఆయన ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును, వారికి అందిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను ఆశీర్వదించాలన్నారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల బ్రోచర్లను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షాహిదా, జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, సిద్ధయ్య, నిరంజన్, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రఘు, బాషా, గంగిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. మైలవరంలో ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన ఎమ్మెల్యే మాట్లాడూతూ గత ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే డ్వాక్రా సంఘాలకు మహిళలకు, రైతులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు.జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలకు ఇచ్చిన హమీలను కాకుండా ఇవ్వని హమీలను అమలు చేశాడన్నారు. ప్రజలు తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాలన్నారు. అనంతరం జెండా ఆవిష్కరించి, జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు.

కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, వైస్ చైర్మన్ సుబ్బరాయుడు, జడ్పీటీసీ మహలక్ష్మీ, సర్పంచ్ సోనుబాయి, సింగిల్ విండో అధ్యక్షుడు గుర్విరెడ్డి, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వర రెడ్డి, రాఘవరెడ్డి, వేణు, శేఖర్, విష్ణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని టి.కోడూరు గ్రామంలో గురువారం జగనన్న ఎందుకు కవాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొని గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును అవిష్కరించి అనంతరం జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు మళ్లీ సీఎంగా జగనన్ననే ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎస్.రామసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, యస్వంత్‌రెడ్డి, మురళీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజలు ఫ్లోరైడ్‌తో ఇబ్బందులు పడకుండా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బి. కొట్టాల పల్లెలో నూతన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో విద్యుత్ సర్వీస్‌లు మోటార్లకు ట్రాన్స్‌పార్మర్లు రాలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. విద్యుత్ అధికారులకు చెప్పి త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఉపమండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ బి.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహార విషయాలలో తగిన శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : విద్యార్థులు ఆహార విషయాలలో తగిన శ్రద్ధ చూపాలని కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మానవ ఇంద్రియాలలో ప్రధానమైన నేత్రాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆప్తామాలజీ డాక్టర్ వై.ఏసురత్నం మాట్లాడుతూ నేత్రాల సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆహార విషయాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం దృష్టిలోప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్స్ ఓబుళరెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కమలాపురం : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్, కామనూరు శ్రీనువాసులురెడ్డి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 12వ తేదీ నుంచి అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. అందులో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోండి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొండాపురం : విద్యుత్ సబ్‌స్టేషన్లల్లో ఉద్యోగాలు అమ్ముకున్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతరాజారెడ్డిలపై మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఇలాంటి అసత్య ఆరోపణలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అల్లం సత్యం ఎద్దేవా చేశారు. గురువారం కొండాపురం వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండాపురంలో బుధవారం టీడీపీ వారు నిర్వహించిన పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతరాజారెడ్డిలపై ఇలాంటి వ్యాఖ్యాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. గండికోట నిర్వాసితులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో నిర్వాసితులకు రూ.10 లక్షలు పరిహారం అందజేశారన్నారు. తొలి విడత 14 గ్రామాలకు అదనంగా రూ.3.25 లక్షలు ఇవ్వాలని రూ.425 కోట్లు జీవో కూడా విడుదల చేసిన విషయం టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డికి తెలియకపోవడం సిగ్గుచేటన్నారు. విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, కొండు వినోద్‌కుమార్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి, తిమ్మాపురం శేఖర్, చోటు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ నరసింహారెడ్డి

లింగాల : రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెద్దకుడాల రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి రమేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకే సిబ్బందిని ప్రస్తుత రబీ సీజన్‌లో అమలవుతున్న వ్యవసాయ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్‌బీకేలో రికార్డులను పరిశీలించి తగిన సూచనలు సలహాలు అందించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. అనంతరం పెద్దకుడాలలో వేరుశనగ పంటను పరిశీలించారు. రబీలో సాగు చేసిన వేరు శనగ పంటలో పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి తెలిపారు. గురువారం మండలంలోని పాతసంగటిపల్లె గ్రామ పొలాల్లో సాగులో ఉన్న పంటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పంట సాగు చేస్తే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మహిళ ఏటీఎం మోడల్, ఏగ్రేడ్ మోడల్, కిచెన్‌గార్డెన్‌లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీ ఏపీఎం శైలజ, వెంకటేశ్వరావు, ఎంటీ గంగిరెడ్డి, రెతులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం

వేంపల్లె : గ్రామస్థాయిలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ప్రజాప్రతినిధులకు ఆడుదాం-ఆంధ్రా క్రీడా సంబరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి 45 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ క్రీడా సంబరాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాప్రతినిధులు వారి ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి క్రీడా సంబరాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో ఖో తదితర పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో గుర్తింపు తెచ్చే విధంగా క్రీడాకారులను తయారు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో కంపచెట్లను తొలగిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలోని పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పరిశుభ్రం పచ్చ తోరణం అనే నినాదానికి నాంది పలికారు. అనంతరం ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించి చెత్తా చెదారాలను పరిశుభ్రం చేయించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటేనే ఎటువంటి జబ్బుల బారినపడకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సమాజ సేవపై, సమాజంపై బాధ్యత ఏర్పడి మంచి నడవడికను అలవరుచుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కోటేశ్వరి, కొండారెడ్డి, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు దారి ఏర్పాటు

చింతకొమ్మదిన్నె : నాగిరెడ్డిపల్లిలోని స్మశాన వాటిక దారికోసం పొదలను తొలగించి గ్రావెల్ రోడ్డును ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేయించారు. గురువారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుభ్రం చేశారు.

మరమ్మతులకు నిధులు విడుదల

చెన్నూరు : మండలంలోని 34 అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు నేడు ఫేజ్-2 కింద మరమ్మతు పనులకు రూ.23,31,000 నిధులు మంజూరయ్యాయని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులలో భాగంగా పనులు చేపట్టేందుకు వెంటనే బ్యాంకు ఖాతాలు ప్రారంభించి పనులు ప్రారంభించాలని ఐసీడీఎస్ అధికారులకు వారు సూచించారు. ప్రతి గ్రామంలో మదర్స్ కమిటీలు వేయాలని, గ్రామ మదర్స్ కమిటీకి అంగన్‌వాడీ వర్కర్ చైర్మన్‌గా ఉంటారని, కమిటీ ఆధ్వర్యంలో పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, గుర్రమ్మ, ఎంపీటీసీ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రూట్స్ డే వేడుకలు



చిన్నారులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ఫ్రూట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. గురువారం ఫ్రూట్స్ డే సందర్భంగా నర్సరీ నుంచి యూకేజీ వరకు చిన్నారులు ఫ్రూట్స్ కలర్స్ దుస్తులతో అందరిని అలరించారు. పండ్లు ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఎండీలు చైతన్యారెడ్డి, చేతన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం



గ్రామోత్సవంలో దీపాలతో పాల్గొన్న మహిళలు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో అయ్యప్ప స్వామి భక్తులు భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గురువారం రాత్రి పట్టణంలోని నాగలకట్ట వీధిలో వెలసిన శ్రీజ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పొరెడ్డి మహేశ్వరరెడ్డి, అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం, అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. సంజామల మోటు, పాతబస్టాండ్, మెయిన్‌బజార్, పలగాడి సెంటర్ మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. చెక్క భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.